క్లుప్తంగా

అదుపు తప్పిన బైక్..

● గర్భిణిని ఆస్పత్రికి తరలించిన ఎస్సై కమలాకర్

గోవిందరావుపేట : గోవిందరావుపేటకు చెందిన బందువల్లి మనోహర్, అతని భార్య కళావతి గర్భిణి కావడంతో ఆస్పత్రికి తీసుకెళ్లి తిరిగి వస్తున్నారు. గురువారం సాయంత్రం వర్షం పడుతుండడంతో బైక్ అదుపు తప్పింది. దీంతో గర్భవతి అయిన కళావతి కింద పడడంతో బలమైన గాయాలయ్యాయి. అక్కడే పెట్రోలింగ్ చేస్తున్న పస్రా ఎస్సై అర్స్డ్ కమలాకర్ 108 అంబులెన్స్‌లో ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. గ్రామస్తులు ఎస్సై కమలాకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

'బీసీ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలి'

గోవిందరావుపేట : ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన బీసీ పోరుగర్జన మహాధర్నాలో ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల చంద్రశేఖర్ మాట్లాడుతూ..బీసీ రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో కుల గణన చేసి 42శాతం రిజర్వేషన్ బిల్లుకు ఆమోదం చేస్తూ అసెంబ్లీలో తీర్మానం చేసిందని అన్నారు. నాయకులు జంపాల ప్రభాకర్, పులుగుజ్జు వెంకన్న, గుండెబోయిన అనిల్ యాదవ్, శ్రీకాంత్, వెంకటేష్, సూర్యప్రకాశ్, మల్లేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

విరాళం



చిట్యాల: మండలంలోని నవాబుపేట గ్రామంలో శిథిలావస్థలో ఉన్న పురాతన శివాలయ పునర్ నిర్మాణానికి మండల కేంద్రానికి చెందిన బీరవోలు నిర్మలబ్రహ్మేందర్‌రెడ్డి దంపతులు గురువారం రూ.2 లక్షల విరాళం ప్రకటించారు. ఇందులో భాగంగా ముందుగా రూ.50వేలు ఆలయ కమిటీ అధ్యక్షుడు కసిరెడ్డి రత్నాకర్‌రెడ్డికి అందజేశారు. విరాళం అందజేసిన దంపతులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మోత్కూరి నరేశ్, సర్వ శరత్, మండల రామ వారెడ్డి, కొమ్ముల సారంగం, ఠీగల నాగరాజు, చెక్క నర్సయ్య, శంకర్, కల్వ సమ్మిరెడ్డి, రాజయ్య, రవి, రాజు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయ ఐడీఓసీ మందిరంలో రేపు(శనివారం) ఉదయం 10 గంటలకు నిర్వహించే దేశ మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలకు అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరుకావాలని షెడ్యూల్ కులముల అభివృద్ధి శాఖ అధికారి సునీత గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పరామర్శ



చిట్యాల: మండలంలోని వల్లగరిగ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బండి రవీందర్ తండ్రి మొగిలి ఐలేవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆకుల రవీందర్ గురువారం పరామర్శించారు. ఆయన వెంట నాయకులు సుంకరి మహేష్, మ్యాదరి స్వామి, బండి రాజు, అశోక్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వాసు, వెంకట్రాజం ఉన్నారు.

పాలాభిషేకం



టేకుమట్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సన్న బియ్యం పంపిణీ కార్యక్రమం సందర్భంగా గురువారం మండలంలోని రామకిష్టాపూర్ (వి)లో బ్లాక్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు నాంపెల్లి వీరేశం ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఆనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీలో దొడ్డు బియ్యం అందజేయడం మూలంగా ఎవరూ కూడా తినలేక అమ్ముకున్నారని అన్నారు. ప్రజా పంపిణీ కార్యక్రమం ప్రజలకు ఉపయోగపడాలనే లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి సన్న బియ్యాన్ని పంపిణీ చేస్తున్నారని చెప్పారు. దీని ద్వారా దళారుల చేతికి బియ్యం పోకుండా అడ్డుకట్ట వేశారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు ఎద్ద రమేశ్, మాజీ సర్పంచ్ అడగాని రామారావు, చేరాలు, వీరన్న, లద్దునూరి పోశాలు, రజినీకాంత్, డీలర్ ఓదేలు, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యుడిని నియమించరూ?

మూగజీవాలకు వైద్యం అందని ద్రాక్షేనా..!

● లైవ్ స్టాక్ అసిస్టెంట్ బదిలీతో వైద్యం చేస్తున్న అటెండర్

● అత్యవసరమైతే ప్రైవేటు వైద్యులే దిక్కు



కన్నాయిగూడెంలోని పశు వైద్యశాల

అత్యవసర వైద్యం చేస్తున్నాం..

పశువులకు వైద్యం అత్యవసరమని తెలిస్తే అక్కడికి వెళ్లి చికిత్స చేస్తున్నాం. నేను అక్కడ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తున్నా. కన్నాయిగూడెం ఆస్పత్రిని అటెండర్ చేయాలి. ప్రస్తుతం సబ్‌ సెంటర్‌గానే కొనసాగుతోంది. ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తా.

– శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డాక్టర్

కన్నాయిగూడెం : మూగజీవాలకు అందని ద్రాక్షలా వైద్యం తయారైంది. మండలంలో తొమ్మిది నెలలుగా పశు వైద్యాధికారి లేరు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న లైవ్ స్టాక్ అసిస్టెంట్ బదిలీ కావడంతో ఆ పోస్టు ఖాళీగానే ఉంది. కన్నాయిగూడెంలో రైతులు పూర్తిగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. పశుపోషణతోనే వ్యవసాయం ఎక్కువగా సేద్యం చేస్తుంటారు. గేదెలు, పశువులు, మేకలు, పెరటి కోళ్ల పెంపకంలో ఇక్కడి రైతులు జీవనం సాగిస్తుంటారు. పశువులు, గేదెలు 4,500, పెంపుడు కోళ్లు 20వేలు, మేకలు 10,000 ఉండవచ్చని అధికారులు చెప్తున్నారు. మండలం కేంద్రంలోని పశు వైద్యశాలలో డాక్టర్ పశువులకు చికిత్స అందించే వారు. గతేడాది జూలైలో ఇక్కడ పని చేస్తున్న లైవ్ స్టాక్ వైద్యుడు బదిలీ పై వెళ్లాడు. అప్పటి నుంచి రోగాల బారిన పడిన పశువులకు వైద్యం అందక ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు ఉన్నాయి. తొమ్మిది నెలల నుంచి అటెండర్ అత్యవసర సమయంలో వైద్యం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. లేదంటే ప్రైవేట్ వైద్యంపై ఆధారపడి తమ జీవాలను కాపాడుకుంటున్నారు. ఇదే అదనుగా భావించిన ప్రైవేట్ వైద్యులు రైతుల నుంచి అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పశువుల డాక్టర్‌ను నియమించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రైవేట్ వైద్యమే దిక్కు..

కన్నాయిగూడెంలో ఆదివాసీ గిరిజన, గిరిజనేతర రైతులు వ్యవసాయం చేయడంతో పాటు గేదెలు, పశువులు, మేకలు, పెరటి కోళ్లను పెంచుతూ జీవనం సాగిస్తుంటారు. వీటికి ఏమైనా జబ్బు చేస్తే అందుబాటులో చికిత్స చేసేందుకు డాక్టర్లు లేకపోవడంతో ప్రైవేట్ వైద్యులను ఆశ్రయిస్తున్నారు. రైతుల అవసరాలను ఆసరాగా చేసుకుంటున్న ప్రైవేటు వైద్యులు అధిక మొత్తంలో డబ్బు దండుకుంటున్నారు. వైద్యం చేసేందుకు అందుబాటులో డాక్టర్లు లేకపోవడంతో ములుగు, ఏటూరునాగారం, కన్నాయిగూడెంలోని మెడికల్ షాపుల నుంచి ఇతర డాక్టర్ల సలహాతో మందులను కొనుగోలు చేసి పశువులకు వైద్యం చేస్తున్నారు.

ప్రైవేట్ వైద్యం చేయిస్తున్నాం..



పశు వైద్యశాలలో డాక్టర్ లేకపోవడంతో ప్రైవేటు డాక్టర్లతో చికిత్స చేయిస్తున్నాము. ఎప్పుడు పోయిన డాక్టర్ ఉండడం లేదు. 60 మేకలను పెంచుకుంటున్న సరైన వైద్యం అందక చాలా మేకలు రోగాలతో మృత్యువాత పడ్డాయి. అందుబాటులో డాక్టర్ ఉంటే మూగజీవాలు బతికి ఉండేవి. తప్పని పరిస్థితిలో నేనే కొన్ని సమయాల్లో మందులు కొనుగోలు చేసి చికిత్స చేశాను.

– కుమ్మరి దుర్గయ్య, రైతు, బుట్టాయిగూడెం

ఇబ్బందులు పడుతున్నాం..



మండలంలోని ఆస్పత్రిలో డాక్టర్ అందుబాటులో లేరు. దీంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రైవేట్ వైద్యం చేయిస్తే అధికంగా వసూలు చేస్తున్నారు. తొమ్మిది నెలల నుంచి డాక్టర్ లేక వైద్యం అందడం లేదు.

– దుగ్గం రాజేశ్, స్థానికుడు

నిరుద్యోగులు దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ

ములుగు : రాజీవ్ యువ వికాస్ యోజన పథకానికి జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈబీసీ నిరుద్యోగ యువకులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ రామకృష్ణ సూచించారు. గురువారం జిల్లాకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎక్కువ మంది అవకాశం కల్పించాలని ప్రభుత్వం ఈ నెల 14వ తేదీ వరకు గడువును పొడిగించిందని అన్నారు. దరఖాస్తులను ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లో సమర్పించాలని సూచించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

గోవిందరావుపేట : మండలంలోని నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాస్ యోజన పథకం దరఖాస్తు గడువును ఈ నెల 14వ తేదీ వరకు పెంచినట్లు ఎంపీడీఓ జవహర్ రెడ్డి గురువారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు దరఖాస్తు చేసుకునే గడువును పెంచినట్లు ఆయన వెల్లడించారు. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

వర్షం.. అన్నదాత హర్షం



పస్రాలో కురుస్తున్న వర్షం



చల్వాయిలో ధ్వంసమైన ఇంటి పైకప్పు

ఎండుతున్న పంటలకు జవసత్వాలు

● ఎండ, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు ఉపశమనం

● బలమైన గాలికి ఇంటి పైకప్పులు ధ్వంసం

గోవిందరావుపేట : మండలంలోని పస్రా, గోవిందరావుపేట, చల్వాయి, దుంపెల్లిగూడెం, రాఘవపట్నం, మొద్దులగూడెం, రాంనగర్ గ్రామాల్లో గురువారం సాయంత్రం రెండు గంటల పాటు భారీ వర్షం కురిసింది. లక్నవరం సరస్సు ఆయకట్టు కింద సాగునీరు అందక రైతులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ తరుణంలో అకాల వర్షం భారీ ఊరట కలిగించింది. లక్నవరంలో నీరు అడుగంటి పోగా చివరి ఆయకట్టు పంటలకు నీరు అందక రైతులు దిక్కుతోచని పరిస్థితిలో సతమతమవుతున్నారు. గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడిప్పుడే వరి గింజ పాలు పోసుకుంటున్న సమయంలో పంటలు ఎండిపోతాయని రైతులు దిగులు చెందుతున్న సమయంలో వర్షం వరంలా మారిందని ఆనందిస్తున్నారు. ఉదయం నుంచి ఎండ తీవ్రత ఎక్కువగా ఉండి, సాయంత్రం పూట రెండు గంటల పాటు కురిసిన వర్షానికి జనం ఉపశమనం పొందారు. అక్కడక్కడ కొన్ని చోట్ల బలమైన గాలులు వీయడంతో ఇంటి పై కప్పులు ధ్వంసమవడంతో పాటు, తక్కువ పంట వ్యవధి ఉన్న వరి వంగడాలు నేలవాలాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. సాయంత్రం పూట రెండు గంటల పాటు కురిసిన వర్షానికి జనం ఉపశమనం పొందారు. ఎండ తీవ్రత, ఉక్కపోతకు అల్లాడిన జనం ఈ వర్షానికి ఊరట చెందారు. రెండు గంటల పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడడంతో వినియోగదారులు ఇబ్బంది పడ్డారు.

వానతో కాస్త ఊరట



లక్నవరం సరస్సులో 16 అడుగుల నీరు ఉండడం, ఎండ తీవ్రత ఎక్కువగా కావడంతో చివరి ఆయకట్టు రైతులకు పది రోజులుగా కంటి మీద కునుకు లేకుండా పోయింది.సాగునీరు కోసం రాత్రింబగలు కావలా ఉండి నీరు పారించుకుంటున్నాం. ఇప్పుడిప్పుడే వరి గింజ పాలు పోసుకుంటుంది. ఈ దశలో పంటకు తడి లేకపోతే గింజ పాలు పోసుకోదు. తాలు ఎక్కువగా వచ్చి ఎండిపోయే అవకాశం ఉంది. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే వారు. ఈ వర్షం వల్ల చివరి ఆయకట్టు రైతులకు ఊపిరి పీల్చుకున్నారు.

– కొంపల్లి కృష్ణారెడ్డి

ఘనంగా దొడ్డి కొమురయ్య జయంతి



కొమురయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఈసీడీఓ రవీందర్‌రెడ్డి తదితరులు

ములుగు : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు దొడ్డి కొమురయ్య జయంతి వేడుకలను గురువారం జిల్లాకేంద్రంలోని సంక్షేమ భవన్‌లో జిల్లా వెనకబడిన తరగతుల అభివృద్ధి అధికారి (డీబీసీడీఓ) చిట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం ఉద్యమం పోరాటంగా మారడానికి కొమురయ్య అమరత్వమే ప్రధాన కారణం అని కొనియాడారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఆద్యుడు దొడ్డి కొమురయ్య అని గుర్తు చేశారు. కార్యక్రమంలో జిల్లా కురుమ సంఘం అధ్యక్షుడు నరిగె రాజకుమార్, ఉపాధ్యక్షుడు యార మల్లయ్య, రాజబాబు, జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ నాయక్, అధికారులు సరిత, మానస, రేణుక, ప్రతాప్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

నాయకుల అరెస్టు సరికాదు



పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

ములుగు రూరల్ : హెచ్‌సీయూ భూములను వేలం వేయొద్దని విద్యార్థి సంఘాల నాయకులు చలో హైదరాబాద్‌కు పిలుపునిస్తే పోలీసులు వారికి అరెస్టు చేయడం సరికాదని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ మహేష్ యాదవ్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో విద్యార్థి సంఘం నాయకులను అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌సీయూ భూములను ప్రభుత్వం వేలం వేయడం సరికాదని పేర్కొన్నారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న పాపన్న

ములుగు రూరల్ : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వెన్నంపల్లి పాపన్న పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశాభివృద్ధికి కొత్తనాంది పలికిందని అన్నారు. ఈనెల 6వ తేదీన (ఆదివారం) బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అన్నారు. ప్రతి కార్యకర్త ఇంటిపై పార్టీ జెండాలను ఆవిష్కరించుకోవాలని అన్నారు. నాయకులు చింతలపూడి భాస్కర్‌రెడ్డి, క్రిష్ణవేణి నాయక్, సునీందర్, జవహర్, రామరాజు, రవీందర్, వెంకటేష్, రాజకుమార్, రాజునాయక్ పాల్గొన్నారు.

నియామకం

చిట్యాల: మండలంలోని వల్లగరిగలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని గురువారం నియమించినట్లు యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కుమార్ తెలిపారు. అధ్యక్షుడిగా కట్ల మహేష్, ఉపాధ్యక్షుడిగా దూదపాక శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిరిపెల్లి నరేష్, ప్రధాన కార్యదర్శిగా దూదపాక సురేందర్, సహాయ కార్యదర్శులుగా పినగాని సురేష్, గొల్లపెల్లి నగేష్, సెక్రటరీగా అల్లె ప్రవీణ్, కార్యవర్గ సభ్యులుగా గొల్లపెల్లి అనిల్, దూదపాక లక్ష్మన్, అల్లె తిరుపతి, దూదపాక రాజు, వేముననూరి రాకేశ్‌లను నియమించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బండి రాజు, మండల యూత్ నాయకులు గోపగాని శివ, చిరంజీవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి ఏర్పాట్లు



ఏటూరునాగారం: పసుపు కొమ్ములను దంచుతున్న మహిళలు



ఏటూరునాగారం: గోటి తలంబ్రాలను ఊరేగిస్తున్న మహిళలు

రామాలయంలో పసుపు దంచుడు కార్యక్రమం

● గోటి తలంబ్రాల ఊరేగింపు

● ఆలయంలో భక్తుల సందడి



వాజేడు: చీకుపల్లి రామాలయం వద్ద సిద్ధం చేసిన యాగశాల



ఆలయంలో తలంబ్రాలను కలుపుతున్న భక్తులు

ఏటూరునాగారం : సీతారాముల కల్యాణ వేడుకకు కావాల్సిన సామగ్రిని మహిళలు సిద్ధం చేస్తున్నారు. మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో గురువారం పసుపు దంచుడు కార్యక్రమాన్ని ఆలయ నిర్వాహకులు, మహిళా భక్తులు నిర్వహించారు. ఈనెల 6వ తేదీన (ఆదివారం) రాములోరి కల్యాణ మహోత్సవ వేడుకల్లో భాగంగా ఈ పసుపు దంచుడు కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆలయ చైర్మన్ అలువాల శ్రీనివాస్ పేర్కొన్నారు. మహిళలంతా కలిసి పసుపు కొమ్ములను దంచి పసుపు తయారు చేసి పూజా కార్యక్రమాలను చేపట్టారు. మహిళలకు ఆలయ నిర్వాహకులు వాయినాలను అందజేశారు.

భద్రాచలం నుంచి తలంబ్రాలు

భద్రాచలంలోని సీతారామచంద్రుడి సన్నిధి నుంచి గోటితో ఒలిచి ప్రత్యేకంగా పూజలు చేసిన గోటితలంబ్రాలను ఊరేగింపుగా మండల కేంద్రంలోని రామాలయానికి భక్తులు, ఆలయ నిర్వాహకులు గురువారం సాయంత్రం తీసుకువచ్చారు. గోటి తలంబ్రాలకు అర్చకులు యల్లాప్రగడ నాగేశ్వర్ రావు శర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపులో మహిళలు కోలాటాలు, నృత్యాలు చేశారు. కార్యక్రమంలో అలువాల శ్రీనివాస్, దీనబాంధవ స్వామి, కత్తెర శ్రీనివాస్, వేణుగోపాల్ లాహోటి, పోగుల లక్ష్మీనారాయణ, చెన్న రాంబాబు, గద్దం వినయ్, సదానందం, ఎగ్గడి జగదీష్, తాడూరి రఘు, శశి, శివ, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబవుతున్న రామాలయాలు

వాజేడు : శ్రీరామ నవమి సందర్భంగా మండలంలోని రామాలయాలను భక్తులు, నిర్వాహకులు ముస్తాబు చేస్తున్నారు. ఈ నెల 6వ తేదీన వైభవంగా సీతా సమేత రాముడి కల్యాణ మహోత్సవం జరుగనుంది. ఆలయ కమిటీలు, నిర్వాహకులు, భక్తులు ఆలయాలను ఇప్పటికే సిద్ధం చేశారు. కల్యాణ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్త కుండా ఏర్పాట్లు చేశారు. మండలంలోని వాజేడు, చీకుపల్లి, పేరూరు, శ్రీరామనగర్, మొరుమూరు, పెద్ద గొల్లగూడెం, జగన్నాథపురం, ఏడ్జెర్లపల్లి గ్రామాల్లో శ్రీరామ నవమి వేడుకలను నిర్వహించనున్నారు. చీకుపల్లి రామాలయం వద్ద యాగశాలను సిద్ధం చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కుమారస్వామి (ఫైల్)

ములుగు రూరల్ : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని ఇంచర్ల శివారులో ఎర్రిగట్టమ్మ వద్ద చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన సిద్ధమనూరి కుమారస్వామి (42) మంగపేట మండలం రాజుపేట–సంగంపల్లిలో నివసిస్తున్నాడు. ఐలేవల సొంతూరికి వచ్చిన కుమారస్వామి తిరిగి రాజుపేటకు వెళ్తున్న క్రమంలో మండలంలోని ఇంచర్ల శివారులోని ఎర్రిగట్టమ్మ వద్ద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కుమారస్వామి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రయాణికులు వెంటనే కుమారస్వామిని ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు కుమారస్వామి మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మద్యం తాగొద్దని మందలించినందుకు..

● యువకుడి ఆత్మహత్య



మధు (ఫైల్)

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని చిరుతపల్లి గ్రామంలో పురుగుల మందు తాగి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. చిరుతపల్లి గ్రామానికి చెందిన చెలే మధు (31) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మతిస్థిమితం సరిగా లేనట్లు ప్రవర్తిస్తాడని కుటుంబీకులు తెలిపారు. మద్యం తాగడం మానేయాలని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌కు సమాచారం ఇవ్వగా వెంకటాపురం వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో ఏటూరునాగారం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై కొప్పుల తిరుపతిరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తాగునీటి కోసం మహిళల ఆందోళన



కాలనీలో నిరసన తెలుపుతున్న మహిళలు

కాటారం: వేసవి కాలం ఆరంభంలోనే మండలంలోని పలు కాలనీల ప్రజలు తాగునీటి కోసం తండ్లాడుతున్నారు. మండల పరిధిలోని రేగులగూడెం లోని తెనుగువాడ కాలనీ ప్రజలు గ్రామ పంచాయతీ ద్వారా తాగునీరు సరఫరా లేక, మిషన్ భగీరథ నీటి జాడలేక నీటి కోసం నానా పాట్లు పడుతున్నారు. కొన్ని రోజులుగా తాగునీరు సక్రమంగా అందడం లేదని ఆరోపిస్తూ గురువారం కాలనీలో మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. ఇప్పటి వరకూ ఒక రోజు కూడా మిషన్ భగీరథ నీరు అందిన దాఖలాలు లేవని, గ్రామ పంచాయతీ ద్వారా నీటి సరఫరా జరగడం లేదని వారు ఆరోపించారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణవేణిని వివరణ కోరగా భూగర్భజలాలు అడుగంటిపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడుతుందన్నారు. తెనుగువాడ ఎత్తులో ఉన్నందున నీటి సరఫరా జరగడం లేదని ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేస్తున్నట్లు పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం



మంగపేట : మండలంలోని కమలాపురంలో తనిఖీ చేస్తుండగా గంజాయి సరఫరా చేస్తున్న వ్యక్తిని గురువారం పట్టుకున్నట్లు ఎస్సై టీవీఆర్ సూరి తెలిపారు. పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సై వివరాలను వెల్లడించారు. కమలాపురంలోని రామన్నగూడెం క్రాస్ రోడ్డు వద్ద తనిఖీలు నిర్వహిస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన కుమ్మరి మోహన్‌రావు (19)ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 475 గ్రాముల రూ.25,000 విలువైన ఎండు గంజాయి ప్యాకెట్, సెల్‌ఫోన్ లభించిందని అన్నారు. ఏటూరునాగారం మండలం శంకరాజుపల్లికి చెందిన కుమ్మరి నారాయణ కుమారుడిగా గుర్తించినట్లు ఎస్సై వెల్లడించారు.